

# మాటా మంతీ

## - సాయి పద్మ



*- 2 -*

## మిణుగుర్లాట

చిన్నప్పుడు , మిణుగుర్లు చూడటం భలే ఉండేది .. ఎందుకమ్మమ్మా .. అవి అంతలా వెలుగుతాయి అంటే , " అవి ముడ్డికి లాంతర్లు కట్టుకొని తిరుగుతాయి లే , నోరు మూసుకొని పడుకో !" – అనేది మా అమ్మమ్మ .. లాంతర్లు అక్కడ ఎలా కట్టుకోనేవా అని ఆలోచించేలోగా నిద్ర వచ్చేసేది ..!!

ఇప్పటికీ ఎన్ని తెలిసినా ..లాంతర్ల కాన్సెప్ట్ భలే అనిపిస్తుంది. అదే నమ్మాలనిపిస్తుంది కూడా.. ! అందులోంచే భలే ఊహలు ..కొత్త కొత్త ఆలోచనలు , మిణుగుర్లకి చీకటి అంటే భయం ఉండదు కదా.. వాటికి వేరే టార్చ్ లైట్లు అవసరం లేదు కదా ఇలాంటి పిచ్చి పిచ్చివి !

తర్వాత గడుస్తున్న కొద్దీ.. మిణుగుర్లకీ , నాకూ ఏదో తెలీని గమత్తైన రిలేషన్ ఉండేది అనిపిస్తుంది. వెనకాల వెలుగు రవ్వలు ఉన్నా, ముందుకి చీకట్లో కదిలే మనుషులకీ , మనలాంటి అందరికీ ఉండే సంబంధం లాంటిది. చాలా సార్లు అలాంటి ఫీలింగ్ కలుగుతుంది. చీకటికీ, వెలుక్కీ ఉన్న మిణుగుర్లాట భలే ఉంటుంది. వెలుగులో ఉండాలని తపన పడుతూ, చీకటిని పట్టించుకోని మనుషులు , చీకటి దారుల్లో పడి , వెలుతురు అక్కర్లేని మనుషులు .. ఎంత వింత ప్రపంచం!!

అలాగే ఈ మధ్య “ మిణుగురులు “ అని సినిమా వచ్చింది. చాలా మంచి సినిమాల్లాగే , ఒకటీ రెండు చోట్ల తప్ప థియేటర్ లలో ఎక్కువగా ఆడలేదు. కర్ణుడి చావులా దానికి రకరకాల కారణాలు .. థియేటర్లు దొరక్కపోవటం, దొరికిన చోట, తగినంత పబ్లిసిటీ కాకపోవటం లాంటివెన్నో .. నేను చూద్దామని సరదా పడ్డ సినిమాల్లో, ఇదొకటి. నేనే కాదు, నాలాంటి ఎంతో మంది challenged వాళ్ళని అడ్రస్ చేస్తూ తీసిన సినిమా. మొదటిసారి షుమారు నలభై అంధ విద్యార్థులు నటించిన సినిమా , అని విని , అక్కడక్కడా చదివి , చాలా ఉత్సాహపడ్డాను. కానీ ఎప్పుడొచ్చి ఎలా వెళ్ళిపోయిందో తెలీలేదు మొదటిసారి. అందుకే , పట్టుదలగా , మా సంస్థ తరపున వేయిద్దామని , ఇంకా మిగతా సంస్థల వాళ్ళు, పిల్లలు .. ముఖ్యంగా యువత చూస్తారని ఆశపడ్డాను .. పడితిని పో.. ఊరక ఉండక అందర్నీ కెలికాను. పాపం రోటరీ క్లబ్ వాళ్ళు ఈ భారం తమ మీద వేసుకొని, అన్ని రకాల వికలాంగులూ వచ్చేలా ఒక వెన్యూ వెతికారు. నిజానికి అదే చాలా కష్టమైన పని ఇండియా లో. అవసరం ఉన్నా, లేకపోయినా మెట్లు, అనువైన బాత్రూం సౌకర్యం లేకపోవటం,ఎక్కడా సైన్ బోర్డ్స్ లేకపోవటం.. ఫిజికల్ ఛాలెంజ్ ఉన్నవాళ్ళకి అనువైన రిక్రియేషన్ కల్పించటం ఇంత కష్టమైనా పనా అనిపించింది.

మొత్తానికి, ఒక దయగల మాతల్లి ( నిజంగా మాతల్లె..హవా మహల్ అని ఒక ఓపెన్ ఎయిర్ స్పేస్ ఉన్న బంగాళా వోనరమ్మ ) మాకు ఆరోజు సినిమా చూసే సౌకర్యం కల్పించింది. చక్కటి వాతావరణం, బీచ్ ఎదురుగా చల్లని సాయంత్రం. అన్నిరకాలుగా అనువైన వాతారవణంలో .. కొంతమంది విద్యార్థులు, మా సంస్థ వాళ్ళు, రోటరీ మెంబర్స్ అందరం కలిసి " మిణుగురులు " సినిమా ప్రివ్యూ పెట్టుకున్నాం .

నిజం చెప్పొద్దూ.. మొదటిసారి, ప్రైవేట్ ప్రివ్యూ అని చాలా గొప్పయిపోయాను. సినిమా మొదలైంది. అద్భుతంగా ఉంది. అందులో ఇన్వాల్వ్ అయిపోయాను. అంతలో, ఒక ఫ్రెండ్ ..నెమ్మదిగా చేతిని తట్టింది. ఏమిటన్నట్టు .. చూసా .." సినిమా బాగుంది.. జరుగుతున్నదే.. కానీ, బ్లైండ్ వాళ్ళని కొట్టటం అదీ , నేను చూడలేను రా .. వెళ్తాను " –

"అయ్యో అదేంటి? మనకి అన్నీ తెలియాలి కదా.. పేపర్ లో చూసావా .. ఇలాంటివి ఎన్ని స్కూళ్ళ లో జరుగుతున్నాయి" అన్నాను .

" నిజమే అనుకో.. కానీ ఇవి చూస్తే, రాత్రికి పడుకోలేను ..నేను చాలా సున్నితం రా " తను వెళ్ళిపోయింది. ఇంచుమించు అలాంటి ఎక్స్క్యూజ్ లే చెప్పి మరో ఇద్దరు, చెప్పకుండా మరో కొంతమంది ( చెప్పలేదు కదా ..నంబర్ తెలీదు ) జారుకున్నారు. అందరూ సున్నితమైన వాళ్ళే పాపం .. !

నిజానికి, అంధులు పడుతున్న బాధల్నీ, అందులో ఉన్న అందాన్నీ, ధైర్యాన్ని, ఎంతో సహజంగా చెప్పిన సినిమా అది. ఎక్కడా అతి జాలి గానీ, అతి ప్రవర్తన గానీ చిత్రించలేదు. కడవల కొద్దీ కరుణ, సుమోల కొద్దీ హింస కురిపించే సగటు తెలుగు సినిమా కన్నా ఈ సినిమా ఏ రకంగా తక్కువ అయిందో నాకు అర్ధం కాలేదు. ఖండ ఖండాలుగా , మనుషులు తెగి పడే దృశ్యాలు, శృంగారాన్ని దాటి అతి బండగా , జుగుప్సాకరంగా అనిపించే డాన్స్ లూ, చూసినప్పుడు , ఈ సున్నితత్వం ఎటు వెళ్ళింది ?

మళ్ళీ అలా చెప్పినవాళ్ళు, సహజంగా ఎంతో మంచివాళ్ళుగా పేరు తెచ్చుకున్న వాళ్ళు, చాలా దైవ భక్తీ, పాప భీతి ఉన్నవాళ్ళు. ఒక చావు చూడలేరు, ఒక నిజం గమనించలేరు .. ముసలితనం భరించలేరు, అనాకారితనాన్ని అసహ్యించుకోకుండా ఉండలేరు..మనిషిని నిండారా ప్రేమించలేరు. సున్నితత్వ మనుషులే పాపం!

ఆ మధ్య ప్రముఖ రచయిత్రి పి. సత్యవతి గారితో మాట్లాడుతుంటే, ఆమె అదే అన్నారు .. " సినిమాల్లో, ఒక కరుణ రసాత్మక దృశ్యం చూసి, కళ్ళనీళ్ళు పెట్టుకుంటారు మళ్ళీ .. అదే మనం ఆపగలిగే వీలున్న విషయంలో కూడా స్పందించరు ..ఎందుకలా ??" ఇదే విషయాన్ని మరో కోణంలో చెప్పారు అనిపించింది. నిజమే కదూ ..??

ఇవి ఆలోచిస్తే అనిపించింది ఒకటే, భయం .. ఒక విషయం బాధ్యతగా ఆలోచించాలంటే భయం ..ఏమీ చేయలేకపోయినా .. నా మెంటార్ ఒకాయన డిజేబిలిటీ విషయంలో చెప్పింది గుర్తొచ్చింది– " people are scared of death and disability.. They wish that it never happens to them.. They shoo away it with money, and tries to escape it with their absence "– చాలా సార్లు నమ్మలేదు గానీ.. ఈ సారి నమ్మేను.

కొసమెరుపు ఏంటీ అంటే– నిరాసక్తంగా ఈ సినిమాకి వచ్చిన కొంతమంది పిల్లలు, ముఖ్యంగా ఇద్దరు అబ్బాయిలు, ఒకమ్మాయి .. వాళ్ళల్లో ఎబిలిటీని ఎంత బాగా చూపించారు, చాలా నేర్చుకున్నాం అని చెప్పారు .. కొంతమంది రోటరీ సభ్యులు, పిల్లల్లో కూడా ఇంత టాలెంటెడ్ ఏక్టర్స్ ఉన్నారు కదా.. అందునా పూర్తిగా అంధులు.. కాదేదీ ప్రతిభకి అనర్హం అన్నారు..!!

హమ్మయ్య .. వెనకాల వెలుగు నిండి ఉన్నా, చీకట్లో తచ్చాడే మిణుగుర్ల కీ .. దాన్ని సెర్చ్ లైట్ లా చేసుకొని , గమ్యం చేరుకొనే నిజమైన మిణుగుర్ల కీ తేడా తెలిసింది .. ఒక్క మనిషి మనసులో మార్పు చాలు కదూ.. ఎన్నో మార్పులకీ.. కొత్త వోర్పులకీ..!

అందమైన లోకమనీ.. రంగురంగు లుంటాయనీ.. ఉండాలనీ ..!!

మళ్ళీ వచ్చే నెల కలుద్దాం .. అప్పటిదాకా ..

శ్రీరామ పాద రస ధూళి .. నను చేర మరిచెనా .. అన్నట్టు ఈ పాట మిణుగురులు సినిమాలోదే ..!!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments